నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | సెప్టెంబర్ 02, 2024 | www.navatelangana.com

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

నవతెలంగాణ-నార్నూర్



లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకి రావొద్దని గాదిగూడ ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సాయిప్రసాద్, నార్నూర్ ఎంపీఓ స్వప్నశీలా సూచించారు. ఆదివారం గాదిగూడ మండలంలోని అర్జుని గ్రామపంచాయతీ పరిధిలోని మారుగూడా, నార్నూర్ మండలంలోని బాబేఝరీ గ్రామపంచాయతీ పరిధిలోని ధానుగూడ గ్రామ సమీపంలో ఉన్న వాగు శనివారం రాత్రి కురసిన భారీ వర్షాలకు చెరువులు, వాగుల ఉధృతి కారణంగా ప్రజలు బయటకి రావొద్దని ప్రజలకు పలు సూచనలు చేశారు. వారి వెంట కార్యదర్శులు రవి కుమార్, విజయ్ కుమార్ ఉన్నారు.

ఆర్టీసీ బస్సు రాయితీ పథకాలపై అవగాహన

నవతెలంగాణ-తలమడుగు



మండలంలోని భరంపూర్ గ్రామంలో ఆదివారం ఆర్టీసీ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలతో పాటు రాయితీ పథకాలపై ఆర్టీసీ అధికారులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బస్ పాస్‌లు, వికలాంగుల పాసుల రాయితీపై వివరించారు. అదేవిధంగా పెండ్లిల కోసం బస్ కావాలనుకునేవారు. ఆర్టీసీ అధికారులను సంప్రదించాలన్నారు. రోడ్డు భద్రత నియమాల పట్ల, వర్షా కాలంలో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీటీఓలు ఎం.శ్రీనివాస్, పి.మధు, వీఆర్ రాకేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎడతెరిపి లేని వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం

- ఉమ్మడి జిల్లాలో విస్తరంగా కురుస్తున్న వర్షాలు
- ఉగ్రరూపం దాల్చిన నదులు..పొంగిపోర్లిన వాగులు వంకలు
- పలు ప్రాజెక్టుల గేట్ల ఎత్తి దిగువకు నీటి విడుదల
- అప్రమత్తంగా ఉండలాని ప్రజాప్రతినిధులు, అధికారుల సూచన

ఉమ్మడి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. వర్షం దాటికి పలు ప్రాంతాలు అతలకుతలం అయ్యాయి. శనివారం రాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఆదివారం రాత్రి వరకు కొనసాగింది. ఏకదాటిగా విరామం లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఉమ్మడి జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద నీరు అధికంగా రావడంతో గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగ నదులు ఉగ్రరూపం దాల్చాయి. ఆయా నదుల సరిహద్దు గ్రామాల్లోకి వరద నీరు వెళ్లడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కుంటాల మండలంలో లింబ-ఓల గ్రామాల వాగుల మధ్య ఆర్టీసీ బస్సు చిక్కుకుపోవడంతో ప్రయాణీకులు సురక్షితంగా బయటపడ్డారు. వీటితో పాటు పలు ఏజెన్సీ గ్రామాల్లో లోలెవల్ వంతెనాల పై నుంచి వరద ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవహం కారణంగా కడెం, సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ, వట్టివాగు, అడ, గడ్డెన్న తదితర ప్రాజెక్టుల గేట్లు ఎత్తి వదర నీటిని వదులుతున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. ఆయా జిల్లా కేంద్రాల్లోని కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకూడదని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచిస్తున్నారు.

స్వర్ణ ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ ప్రాజెక్టును ఆదివారం కలెక్టర్ అభిలాష అభినవ్ సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద వివరాలు, అవుట్ ఫ్లో ప్రాజెక్టులో నిలువ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా 8 వేల క్యూసెక్కుల నీరు రావడంతో నీటి పారుదల శాఖ అధికారులు 12 వేల క్యూసెక్కుల నీటిని గేట్ల ద్వారా దిగువకు విడుదల చేశారన్నారు. రాబోయే 24 గంటల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగు పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితిలో తప్ప బయటకు ఎవరు రావద్దన్నారు. కలెక్టర్ ఎస్పీ జానకి షర్మిల, ఈఈ లక్ష్మీ, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీఓ లక్ష్మీ కాంతారావు, ఆర్ఐ వెంకట నర్సయ్య, ప్రాజెక్టు అధికారులున్నారు.


మత్తడి వాగు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేత



నవతెలంగాణ-తాంసి

భారీ వర్షంతో మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుండి భారీగా వరద నీరు చేరడంతో ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదిలినట్లు ప్రాజెక్ట్ అధికారి హరీష్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నీటిమట్టం 277.50 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 277.20 వద్ద నీటి అడుగులు కొనసాగగా ఎగువకు వర్షం కురిసే సూచనతో ముందస్తుగా మూడు గేట్లను ఎత్తివేయడం జరిగిందన్నారు. ఇన్‌ఫ్లో 16640.0 క్యూసేట్లు, అవుట్ ఫ్లో 17100.0 క్యూసెట్లు నీటిని దిగువకు వదిలినట్లు తెలిపారు.

వట్టివాగు, అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు నమోదు కావడంతో ప్రాజెక్టుల్లో వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం ఉదయం 10 గంటలకు అడ ప్రాజెక్టు నాలుగు, ఐదు, ఆరు నెంబర్ గల గేట్లను 0.5 మీటర్లు పైకి ఎత్తి 3200 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టు ఒక గేటు 0.4 మీటర్లు పైకెత్తి 760 క్యూసెక్కుల నీటిని అధికారులు కిందికి వదులుతున్నారు. దీనితో కింద ఉన్న గుండి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.

భారీ వర్షాలతో అతలాకుతలమైన జనజీవనం

- గడ్డెన్న వాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత
- ఉప్పొంగిన వాగులు వంకలు నిండిన చెరువులు
- జలదిగ్బంధంలో గ్రామాలు
- అప్రమత్తంగా ఉండాలన్న ఎమ్మెల్యే రామారావు పటేల్



నవతెలంగాణ-బైంసా

పట్టణంతో పాటు నియోజకవర్గంలో భారీ వర్షాలు కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. శనివారం రాత్రి నుండి ఆదివారం దినమంతా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. చెరువులు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. దీంతో గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో పదిహేను వేల క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేసి వదలడంతో సుద్ద వాగు ఉప్పొంగి ప్రవహించింది. బైంసా పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పల్సికర్ రంగారావు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ములంగా గుండెగం గ్రామం వద్ద రహదారిపై వంతెనపై నుండి నీరు ప్రవహించడంతో ఆ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. కుంటాల మండలంలో లింబ-ఓల గ్రామాల వాగుల మధ్య ఆర్టీసీ బస్సు చిక్కుకుపోవడంతో అందులో చిక్కుకున్న కండక్టర్, డ్రైవర్ మరో మహిళా ప్రయాణికురాలని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తానూర్ మండలంలోని ఝరి-బి వద్ద వంతెనపై నుండి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు దినమంతా ఇండ్లలోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు, వాగు పరివాహక ప్రాంతాల్లో పంట పొలాలన్నీ జలమయమై నీట మునగడంతో పంట నష్టం వాటిల్లింది. ఉదయం వేళ నుండి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజానీకానికి ఏమైనా ఇబ్బందులు అయితే తనకు నేరుగా సంప్రదించాలని కోరారు. పోలీస్, ఇతర శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు.



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్



బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపిడనం కారణంగా రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఖానాపూర్ నియోజకవర్గంలోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. వర్షాల నేపథ్యంలో ఆయన ఓ వీడియో విడుదల చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వాగులున్న గ్రామా ప్రజలు నీరు ప్రవహించే సమయంలో వాగులను దాటే ప్రయత్నం చెయ్యొద్దన్నారు. రైతులు భారీ వర్షం కురుస్తున్న సమయంలో పంట పొలాలకు వెళ్ళకూడదన్నారు. నియోజకవర్గంలోని ఇంద్రవెల్లి, ఉట్నూర్, కడెం, దస్తురాబాద్, పెంబి, ఖానాపూర్, సిరికొండ, జన్నారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆపద సమయంలో 100 నంబర్ కాల్ చేయాలనీ సూచించారు. లేదా నేరుగా తనకు ఫోన్ చేయాలన్నారు.

సీపీఎస్‌తో నష్టపోతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కొత్త పెన్షన్ విధానం కారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు నష్టపోతున్నారని తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ అశోక్ అన్నారు. సెప్టెంబర్ ఒకటి పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తు ఆదివారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవనం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్ మీదుగా ర్యాలీ ఆర్ అండ్ బీ విశ్రాంతి భవనం వరకు సాగింది. ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో వక్తలు కొత్త విదానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ అశోక్ మాట్లాడుతూ ఒకటి సెప్టెంబర్ 2004లో నూతన పెన్షన్‌ను అమలులోకి వచ్చిందన్నారు. ప్రపంచ బ్యాంకుల సంస్కరణలకు అనుగుణంగా కొత్త పెన్షన్ విధానం ఉందన్నారు. నాలుగు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలువుతుందన్నారు. అదే విధంగా కొత్తగా సోమ్‌నాథ్ కమిటి యూనిఫైడ్ పెన్షన్ పేరిట మరో విధానం తీసుకువచ్చేలా కేంద్రం యోచిస్తుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తు అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేంత వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వృకోధర్, వెంకట్, సోగల సుదర్శన్, నవీన్ పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో నిరసన...

జేఏసీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎన్టీఆర్ చౌరస్తాలో నల్లబ్యాడ్జిలను ధరించి ఆదివారం నిరసన తెలిపారు. సీపీఎస్ రద్దు చేయడంతో పాటు ఓపీఎస్‌ను అమలు చేయాలని అన్నారు. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి అన్నారు. అప్పటి వరకు ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, పేటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి, టీజీ టీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చవాన్ నరేష్, టీఎస్పీటీఏ అధ్యక్షుడు రియాజ్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిట్ల రాజేష్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ట్రస్మా నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల సంఘం(ట్రస్మా) ఆసిఫాబాద్ మండల కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రోగ్రెస్ పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు దేవభూషణం అధ్యక్షతన రాష్ట్ర అస్సోసియేట్ అధ్యక్షులు పెద్దపల్లి కిషన్ రావ్ ఆధ్వర్యంలో కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షలుగా హివ్రే సందీప్ కుమార్, ఉపాధ్యక్షులుగా హిదయుతుల్ల, కార్యదర్శిగా జాడే సురేష్, కోశాధికారిగా సబీర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన సలహాదారులు సుబ్బ మహేష్, జిల్లా కార్యదర్శి తిరుపతి చారి, కోశాధికారి రాజేంద్రప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ దిక్కొండ సంజీవ్ కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జితేష్ శితని, కాగజ్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ కుమార్, అర్గనైజింగ్ సెక్రెటరీలు రాధాకృష్ణచారి, మల్లిక్ పాల్గొన్నారు.

4 నుంచి గ్రామ, మండల కమీటీల ఎన్నిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మాల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలో భాగంగా ఈనెల 4 నుంచి గ్రామ, మండల కమీటీలను ఎన్నుకోవడం జరుగుతుందని ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ సింగరి అశోక్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డులోని సంఘ భవనంలో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించి, గ్రామ, మండల కమిటీ ఎన్నికల తేదిని ప్రకటించారు. అయితే జిల్లా సంఘం రెండు సంవత్సరాల కాలపరిమితి ముగిసి కూడా సంవత్సరం అయిన కూడా ఎన్నికలు జరగలేదు. దీంతో కమిటీ ఎన్నికకు ప్రణాళికలు చేస్తున్నారు. మాల సంక్షేమ సంఘం కార్యవర్గం లేక సమస్యల పరిష్కరానికి సమస్యలు వస్తున్నాయని సంఘ సభ్యుల ఫిర్యాదుల సూచనల మేరకు ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 4 నుంచి 14 వరకు గ్రామ కమిటీలు, 15 నుంచి 19 వరకు మండల కమిటీల ఎన్నిక ఉంటుందన్నారు. 20న ఓటరు జాబిత ప్రదర్శించి, ఐడీ కార్డులను ఇస్తామన్నారు. ఐడీ కార్డులున్న వారు మాత్రమే జిల్లా కమిటీని ఎన్నుకోవడానికి అర్హులుగా ఉంటారన్నారు. ఆ తేదీలను కూడా త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కన్వీనర్ చిన్నన్న, సభ్యులు సుభాష్, వినోద్, దయాకర్, స్వామి, ఎల్పుల భూమన్న మాజీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'మతతత్వ రాజకీయాలకు చోటులేదు'

- ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు కృషి
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమేర్ అలీ ఖాన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మతతత్వ రాజకీయాలకు చోటులేదని, దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి విశేష స్పందన లభిస్తోందని, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అమేర్ అలీ ఖాన్ అన్నారు. మతపరమైన విద్వేశాలకు వెళ్లకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని, మంచి ఆలోచన దృక్పథంతో ముందుకుసాగాలన్నారు. భవిష్యత్తు మొత్తం కాంగ్రెస్ పార్టీదే అధికారమని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పర్యటనలో భాగంగా కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించి, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, బౌద్దులు అన్న మతపరమైన విభేదాలకు వెళ్లకుండా పాలు, చక్కెరలా అందరూ ఐక్యతగా మెలగాలని ఆకాంక్షించారు. విభజించి పాలించు విధానాన్ని బీజేపీ అవలంభిస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అన్నివర్గాలను ఏకం చేసేలా ముందుకెళ్తోందన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగిసిందని, జోడో యాత్ర మొదలుకాబోతోందని తెలిపారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి విస్మరించిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. ప్రతిఒక్కరీ తలసరి ఆదాయం పెరగాలన్నదే తన ముఖ్య లక్ష్యం అన్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాల ద్వారా అది సాధ్యం కావడానికి అవకాశం ఉంటుందన్నారు. నవ సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇది గొడవలు పడాల్సిన సమయం కాదని, దేశమంతా ఏకతాటిపైకొచ్చి ఐక్యతను చాటాలని, అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

న్యాయస్థానాన్ని అవహేళనచేసేలా చేస్తున్నారు : జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ విషయంలో కాంగ్రెస్, బీజేపీలు అత్యున్నత న్యాయస్థానాన్ని అవహేళనచేసేలా మాట్లాడుతున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ కవితకు బెయిల్ రావడం పట్ల బీజేపీ, కాంగ్రెస్‌లు, బీఆర్ఎస్ ములాకత్ వల్లనే సుప్రీం కోర్టు నుంచి బెయిల్ వచ్చిందని ఒకరిపై ఒకరు వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఈ రెండు పార్టీలు ఒక్కటేనని, ప్రజల ఆత్మగౌరవం నుంచి పుట్టిన బీఆర్ఎస్ భూస్థాపితం చేయాలని కుట్రలు చేస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నుంచి 8, బీజేపీ నుంచి 8 మంది ఎంపీలున్న బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చేయి చూపిన మాట్లాడలేదన్నారు. కాంగ్రెస్ రుణమాఫీలో రైతులను మోసం చేసిన ఏ ఒక్క బీజేపీ నాయకుడు ఆందోళన చేపట్టాలేదన్నారు. దీన్ని బట్టి చూస్తే ఈ రెండు పార్టీలు ఒకేటనని అర్థమవుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు తగిన పాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు రోకండ్ల రమేష్, పట్టణ అధ్యక్షుడు అజయ్, పార్టీ ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, శివ, జగదీష్, పరమేశ్వర్, ఆసిఫ్ పాల్గొన్నారు.

భారీ వర్షం వందల ఎకరాల్లో పంట నష్టం

- నీట మునిగిన పంటలు, కోతకు గురైన పంటక్షేత్రాలు

నవతెలంగాణ-తలమడుగు



మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి 3వందల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు మండల రైతులు తెలిపారు. ఝరి, పూనగూడ గ్రామాల్లో ఇండ్లలోకి వరద నీరు చేరి, ఎరువులతో పాటు నిత్యావసర సరుకులు తడిసినట్టు గ్రామ గిరిజనులు తెలిపారు. శనివారం భారీ వర్షం కురవడంతో మండలంలోని ఉమ్రి, కొసాయి పూనగూడ, మందగూడ, కప్పర్‌దేవి, తలమడుగు, డోర్లి గ్రామాల రైతులకు చెందిన పత్తి, కంది, సోయా పంటలకు నష్టం వాటిల్లింది. అదేవిధంగా పంట చేనులో నుంచి వర్షం నీరు పారడంతో నేలకోతకు గురికాగా, పత్తి, సోయా పూర్తి నేలమట్టమైనట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు. నేలలు కోతకు గురికాగా తిరిగి పంటలు వేసేందుకు కూడా పనికిరాకుండా పోయాయని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అదేవిధంగా పూనగూడ గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి సీడం మాధవ్ ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో ఎరువులు నిత్యావసర సరుకులు తడిసినట్లు రైతు తెలిపారు. రాజు, నాందేవ్ ఉర్మిళబాయి, పారుబాయి, ధ్రుపద, మీరాబాయి ఇండ్లలోకి నీరు చేరడంతో వెంటనే అప్రమత్తమై కింద ఉన్న వస్తువులను పడుకునే మంచాలపై వేసుకొని, రాత్రంతా చీకటిలో ఉన్నామని తెలిపారు. వెంటనే మండలంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూశాఖ సర్వేలు నిర్వహించి, భారీ వర్షంతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని రైతులు కోరుతున్నారు.



వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రాష్ట్ర వాతావరణ కేంద్రం సూచనల మేర రాబోవు రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ మహిళా మోర్చ మండల అధ్యక్షురాలు రాథోడ్ రాధిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్ష సూచన మేరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముఖ్యంగా రైతులు వ్యవసాయ పనులకు వెళ్లకుండా, జాగ్రత్త వహించాలన్నారు. వాగులు వంకలు దాటకూడదని సూచించారు. ఏదేని ఆపద సంభావించినప్పుడు స్థానిక పోలీసులకు లేదా రెవిన్యూ అధికారులకు సమాచారం అందించాలని తెలియజేశారు. యువకులు, విద్యార్థులు, చెరువు, వాగుల వద్ద వెళ్లి సెల్ఫీలు తీయకుండా జాగ్రత్త వహించాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన నక్క నరేందర్ అనారోగ్యతో మరణించారు. వారి కుమారుడు నడవలేని స్థితిలో ఉన్నడని పేద కుటుంబమని, కేఆర్‌కే కాలనీ చెందిన కుమ్మరిపెళ్లి సాయితేజ ఆదివారం సామాజిక వేత్త మౌనిష్‌రెడ్డికి తెలియజేయడంతో వెంటనే స్పందించిన మౌనిష్‌రెడ్డి నక్క, నరేందర్ అంత్యక్రియల కోసం రూ.5వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబ సభ్యులు మమత, శేఖర్‌లకు అందజేసి ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు మౌనిష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు ఘన సన్మానం

నవతెలంగాణ-సారంగాపూర్



మండలంలో వ్యవసాయాధికారిగా ఇదివరకు పనిచేసిన రాజశేఖర్ రెడ్డి, ఏఈఓ లావణ్యలు బదిలీపై వెళ్లారు. వారిని అలాగే కొత్తగా మండలానికి వచ్చిన ఏఓ వికార్‌అహ్మద్‌లను ఆదివారం మండలంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్లో విత్తన, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు శాలువాలతో సత్కరించి మెమోంటోలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. దీర్ఘకాలికంగా విధులు నిర్వహించి, మీరు మండల ప్రజల మన్ననలను పొందారని కొనియాడారు. ఈ సందర్భంగా ఏఓ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మీ అభిమానం ప్రేమ వెలకట్టలేనివని మిమ్మలని విడిచి వెళ్లడం బాధాకరంగా ఉందన్నారు. వెళ్లాలని లేకున్నా ఉద్యోగ రీత్యా వెళుతున్నానని అన్నారు. నూతంగా వచ్చిన ఏఓ సైతం మీతో కలిసి పనిచేస్తానని వెల్లడించారు.

స్వర్ణ ప్రాజెక్టు రెండు గేట్లు ఎత్తివేత



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని స్వర్ణ ప్రాజెక్టు ఎగువ భాగాన కురుస్తున్న భారీ వర్షాని 10 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు సామర్థ్యం 1183 అడగులకు గాను 1183 పూర్తి స్థాయి అడుగులకు చేరుకోవడంతో నీటి పారుదలశాఖ అధికారులు ఆదివారం 2గేట్లు ఎత్తి 8వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నీటి ప్రవాహం పెరుగుతే అవసరాన్ని బట్టి మరిన్ని గేట్లు ఎత్తి, నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు.అలాగే కుడి, ఎడుమ, మధ్య జౌలి నాలల ద్వారా 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వాతావరణశాఖ తెలిపిన వివరాల ప్రకారం మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

సాయి మాధవ్ నగర్ రోడ్లు జలమయం

- కాలనీని సందర్శించిన తహసీల్దార్



నవతెలంగాణ-ముథోల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఆదివారం మండల కేంద్రంలోని సాయి మాధవ్ నగర్ రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో కాలనీవాసులతో పాటు, ఈ రోడ్డు గుండా రాకపోకలు కొనసాగించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీలో భారీ వర్షంతోనే రోడ్లన్నీ జలమయం అవటం సర్వసాధారణంగా మారింది. అంతేకాకుండా పలు ఇండ్లలో కూడా వర్షపు నీరు వచ్చి చేరుతుంది. ప్రతి సంవత్సరం అధికారులకు నాయకులకు తమ సమస్యను విన్నవించుకున్నప్పటికీ స్పందించేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో రోడ్డు కిరువైపులా మురుగు కాలువలు లేకపోవడం, సక్రమంగా రోడ్డు లేకపోవడంతో ప్రతి సంవత్సరం వర్షంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఎడతెరిపి లేని వర్షాలతో మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని వారు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్‌ఐ నారాయణ పటేల్, కాలనీకి వెళ్లి పరిశీలించారు. ప్రధాన రోడ్డుపై అక్కడక్కడ పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ గుంతల్లో వెంటనే మొరం తెప్పించి వేయించారు. అనంతరం కాలనీలో ఉన్న మహాత్మ జ్యోతిబాపులే హాస్టల్‌ను తహసీల్దార్ తనిఖీ చేశారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సభ్యత్వ నమోదు పండుగలా జరగాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు



నవతెలంగాణ-సారంగాపూర్

బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పండుగలా జరగాలని నిర్మల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు అన్నారు. ఆదివారం మండలంలోని చించోలి(బి) ఆదిత్య గార్డెన్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు కర్ని విలాస్ ఆధ్వర్యంలో క్రియాశీల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ బూత్‌లో 200పై చిలుకు సభ్యత్వ నమోదు నిర్వహించాలన్నారు. సభ్యత్వ నమోదు నెంబర్ 8800002024కి మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చేయించుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాన బీజేపీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కన్వీనర్ సాదు రాంరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చాణక్య, బీజేపీ సీనియర్ నాయకులు రాంశంకర్‌రెడ్డి, వడ్డె రాజేందర్‌రెడ్డి, మంతెన గంగారెడ్డి, సాహెబ్ రావు, బ్యాగరి ఎల్లన్న, కోరిపెల్లి రాజేశ్వర్‌రెడ్డి, లయ కరుణసాగర్‌రెడ్డి, రాజారెడ్డి, ఇప్ప భూమారెడ్డి, తిరుమల చారి, మేకల నవీన్ యాదవ్, విజయ్, తోట భోజన్న, ఈర్ల చిన్నయ్య, సురేష్, రామారావు నాయక్, గోకుల్ పాల్గొన్నారు.

3 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు



నవతెలంగాణ-నార్నూర్

ఈనెల 3 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని మండలంలోని కార్యకర్తలు సభ్యత్వం నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ అన్నారు. ఆదివారం మాన్యాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని గజానంద్ జిన్నింగ్ మిల్‌లో బీజేపీ నాయకులతో, కార్యకర్తలతో కలిసి సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాదవ్ రెడ్డి నాయక్, న్యానోబా పుష్కర్, శేషరావ్, మండల నాయకులు తొడసం బండు, రాథోడ్ భిక్కు, ప్రకాష్, కోటగిరి విశాల్, విద్యారాణి, ఠాకూర్ నాయక్ ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాథోడ్ గణేష్, జిల్లా అధ్యక్షులు జాదవ్ రవీందర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద ప్లాకార్డులతో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీపీ ఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పీఈటీ, హెచ్‌పీటీలను అప్ గ్రేడ్ చేసి గిరిజన సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ నిరసనలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ్ సురేష్, గజేందర్, శేర్ సింగ్, ఇందల్ సింగ్, గోకుల్, వెంకట్‌రామ్ ఉన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన పాత పెన్షన్ అమలు హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహన్, వలభోజు గోపికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ కేంద్ర ఉద్యోగులకు సంబంధించినదని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైన సీపీఎస్ రద్దు విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడం అన్యాయమని అన్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఉద్యోగులందరికీ వెంటనే పాత పెన్షన్ విధానం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి

- కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు చెబుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు, అన్నదాతలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు పాటించాలని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలను ఎట్టి పరిస్థితుల్లోనూ దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. వర్షం కురిసే సమయంలో చెట్ల కింద ఉండకూడదని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లు, వైల్డ్ విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. వర్షం కురుస్తున్న సమయంలో వ్యవసాయ మోటార్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్ చేయవద్దని, తడిచిన విద్యుత్ స్తంభాలు, సపోర్ట్ వైర్లను తాకవద్దని సూచించారు. వ్యవసాయ పంట పొలాల్లో పనులు చేసే సమయంలో వేలాడే విద్యుత్ తీగలు ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్నందున వాటిపట్ల తగు అప్రమత్తంగా ఉండాలన్నారు. లూజ్ వైర్లను ముట్టే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు చేరుతున్నందున గేట్లు ఎత్తివేసే అవకాశం ఉన్నందున వాటి పరివాహ ప్రాంతాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. రైతులతో పాటు పశువుల కాపరులు సైతం తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా మెలగాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రాకుండా ఉండటమే ఉత్తమమని సూచించారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఈ జాగ్రత్తలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే సోమవారం జరిగే పొలాల పండుగను అన్నదాతలు ఆనందోత్సహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని కోరుకుంటూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

పోలాల అమావాస్య సందడి



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ ప్రాంతంలో పోలాల అమావాస్య సందడి నెలకొంది. శ్రావణ మాసంలో అమావాస్యను పురస్కరించుకొని నిర్వహించే పోలాల పండుగ (ఎడ్లపండుగా) కోసం ఐటీడీఏ పీఓ సోమవారం ఐచ్ఛిక సెలవును ప్రకటించారు. పోలాల అమావాస్య సందర్భంగా వ్యాపారుల అలంకరణ వస్తువులు అమ్మడానికి సిద్ధం చేశారు. వానాకాలం పంటల సీజన్ ప్రారంభం నుంచి రైతులు తమ పశువులతో పంట పొలాల్లో పనులు చేయించుకొని పంటలు పండిస్తున్నారు. పోలాల పండుగ సందర్భంగా రైతులు పశువులను శుభ్రంగా కడిగి రంగులు వేసి, అలంకరణ వస్తువులతో అలంకరించి హనుమాన్ మందిరాలకు తీసుకోవెల్లి ప్రదక్షణలు చేయిస్తారు. ఆ తరువాత ఇంటికి వచ్చాక ఎడ్లకు మంగళహారతులు పట్టి, ప్రత్యేక నైవేద్యాలు పెట్టి పూజిస్తారు. ఉట్నూర్ ఏజెన్సీలోని గిరిజనులు, గిరిజనేతరులు పోలాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకోనున్నారు.

ఇరువురి దాడి ఒకరి మృతి

నవతెలంగాణ-నార్నూర్



మండలంలోని కొత్తపల్లి(హెచ్) కొలాంగూడలో ఇద్దరి మద్య జరిగిన దాడిలో సిడాం లక్ష్మణ్(35) మృతి చెందాడు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొలాంగూడకు చెందిన సిడాం లక్ష్మణ్ అదే గ్రామానికి చెందిన మాడవి రాము ఇద్దరు కలిసి కొడప జైతు ఇంట్లో టీవీ చూస్తుండగా టీవీ చానల్ మర్చడం విషయంలో గొడవ జరిగింది. గొడవ జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న భార్య మంతుబాయి భర్త అయిన లక్ష్మణ్‌ను తమ ఇంటికి తీసుకెళుతుండగా మాడవి రాము వెనుక నుంచి వచ్చి లక్ష్మణ్‌ను పిడిగుద్దులు గుద్ది, గొంతు నొక్కాడు, దీంతో లక్ష్మణ్ అపస్మరక స్థితిలోకి వెళ్లిపోయాడు. మృతుడి భార్య కేకలు వేయడంతో రాము పారిపోయాడు. వెంటనే లక్ష్మణ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమద్యలో మరణించాడు. భార్య మంతుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

అత్యవసరమైతే తప్ప బయటకి రావొద్దు : ఆత్రం సుగుణ

నవతెలంగాణ-ఉట్నూర్

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఆత్రం సుగుణ ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. పశువుల కాపరులు, చేపలు పట్టేవారు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల వైపు వెళ్లవద్దని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో కాచి వడబోసిన నీటిని తాగాలని అన్నారు. ప్రజలు, రైతులు వర్షాలు, వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటే అధికారులకు, స్థానిక నాయకులకు సమాచారం అందించాలని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూడాలని సూచించారు.

పోలాల పండుగను జరుపుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్

పోలాల అమావాస్య పండుగను నేతకాని, మహార్ ప్రజలు ఘనంగా జరుపుకోవాలని నేతకాని, మహార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దౌలె వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐబీ చౌరస్తా వద్ద రైతులు ఎడ్లకు అలంకరణ చేసే, వస్తువులతో ప్రచారం చేశారు. నేతకాని, మహార్ ప్రజలు కూడా ప్రతి ఒక్కరూ పోలాల పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

భారీ వర్షంతో పంట పొలాల్లో నిలిచిన నీళ్లు

నవతెలంగాణ-తాంసి

ఇటీవల రాత్రి కురిసిన భారీ వర్షాలకు తాంసి, భీంపూర్ మండలాల్లోని అన్ని గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలకు ఇబ్బందులకు ఎదురయ్యాయి. ఆదిలాబాద్ నుంచి కరంజి వెళ్లే రహదారిలో కప్పర్ల, జందాపూర్, దనోర, వడూర్, అంతర్గాం, గ్రామాల సమీపంలోని లోలెవల్ బ్రిడ్జిలు పొంగిపొర్లడంతో అటుగా వెళ్లి ప్రజలు వాహనదారులు ఎక్కడికక్కడే నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అర్లి(టి), అంతర్గాం, వడూర్, కరంజి, గ్రామాల పంట పొలాలు పెనుగంగా ప్రవాహక ప్రాంతంలో ఉండటంతో పెనుగంగా ఉప్పొంగి పారడంతో పంట పొలాల్లోకి వర్షం నీరు చేరి పంటలు నీట మునిగాయి. వాగులు పొంగిపొర్లడంతో పంట పొలాలకు నీరు చేరి అపార నష్టమే మిగిల్చాయి. మరో రెండు రోజులు అతి భారీ వర్షాలు సూచన ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎట్టి పరిస్థితుల్లో బయట తిరగవద్దని శిథిలావస్థలో ఉన్నటువంటి భవనాలు ప్రజలు ఉండవద్దని తహసీల్దార్, పోలీస్ సిబ్బంది ప్రజలకు సూచించారు.

పార్లమెంట్‌లో చట్టం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్ విధానాన్ని అమలు చేస్తూ అసెంబ్లీ, పార్లమెంట్‌లో చట్టం చేయాలని, దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విషయమై తాము ఆదిలాబాద్ నుంచి గద్వాల వరకు 40 రోజుల పాదయాత్ర చేపట్టనున్నట్టు వెల్లడించారు. రిజర్వేషన్ల ద్వారా లబ్దిపొంది, ఆర్థికంగా ఎదిగినవారే మళ్లీ రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారన్నారు. అటువంటి వారు తమ పిల్లలకు రిజర్వేషన్లు వదులుకోవాలన్నారు. ఆ పనిని కొంతమంది చేస్తున్నారని వివరించారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

ఎస్సైని కలిసిన సీపీఐ నాయకులు

నవతెలంగాణ-బోథ్

నూతనంగా ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ప్రవీణ్‌ని సీపీఐ నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బి.గోవర్ధన్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సిరిపురం దాస్, నాయకులు భోజన్న, బోజారెడ్డి, నరేష్, కార్తీక్, మున్సిఫ్, శ్రీనివాస్, సుమేర్ పాషా పాల్గొన్నారు.



ఎడతెరిపి లేకుండా భారీ వర్షం

- పొంగిపొర్లుతున్న వాగులు, నిలిచిపోయిన రాకపోకలు



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఏకాదటిగా కురుస్తున్న భారీ వర్షంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదురుకోవడం జరిగింది. దీంతో ఆదివారం మండల కేంద్రమైన కుభీర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో శనివారం, ఆదివారం ఏకాదటిగా కురుస్తున్న వర్షానికి ఆస్పత్రి చుట్టూ పూర్తిగా వర్షపు నీళ్ల చౌరవడంతో రోగులకు, ఆస్పత్రి సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో మండల అధికారులు, ఎంపీడీఓ మోహన్ సింగ్, తహసీల్దార్ సోము, ఆస్పత్రి చుట్టూ ప్రక్కల ఉన్న ప్రజలకు అప్రమత్తం చేసి జాగ్రత్తగా ఉండేలా చూడాలని సూచించారు. దీంతో అధికారులు తాత్కాలికంగా వర్షపు నీళ్ల బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని అధికారులు అన్నారు. అదే విధంగా గ్రామాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో జనజీవనం, ప్రజలు ఇంటి వద్దనే ఉండిపోయారు. దీంతో పార్డి(బి) బైంసా రహదారిలో ఉన్న గుండెగాం గ్రామస్తులు సుద్దవాగు పొంగిపొర్లడంతో వాహనదారులకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఝరి(బి)కి రాకపోకలు బంద్

- వంతెనపై పొంగిపొర్లుతున్న వరద నీరు



నవతెలంగాణ-ముథోల్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న బారీ వర్షాలతో తానూర్ మండలంలోని ఝరి(బి) వంతెనపై నుంచి వరదనీరు పొంగి ప్రవహిస్తుంది. ఆదివారం తెల్లవారు జాము నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఝరి(బి), ఝరి తండ, గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పనుల మీద బయటకు వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామానికి చెందిన యువకుడి జేసీబీ సహాయంతో అత్యవసరం పని ఉన్న వారికి మాత్రం వంతెన దాటిస్తున్న పరిస్థితి నెలకొంది. సంఘటన స్థలాన్ని ముథోల్ సీఐ మల్లేష్, తహసీల్దార్ లింగమూర్తి, తానూర్ ఎస్సై సందీప్ ఆదివారం ఉదయం సందర్శించారు. పలు వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీరు ఉధృతి కొనసాగుతుండటంతో వంతెనపై నుంచి ప్రజలు రాకపోకలు చేయకూడదని సూచించారు. పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని వారు పేర్కొన్నారు. ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు.

గణపతి ప్రతిమలను ప్రతిష్టించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలలో ప్రతి ఒక్కరూ మట్టి గణపతి ప్రతిమలను ప్రతిష్టించాలని, పర్యావరణాన్ని కాపాడాలని హిందూ సమాజ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపల్లి హన్మాండ్లు కోరారు. ఆదివారం పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో గణేష్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ తొమ్మిది రోజులు ఘనంగా, శాంతి యుతంగా, కలిసికట్టుగా హిందూ ధర్మం పరిరక్షిస్తూ వేడుకలు నిర్వహించాలని పేర్కొన్నారు. గణేష్ మండపాల వారు విద్యుత్ కనెక్షన్ కోసం ఎటువంటి రుసుములు ఇప్పుడే చెల్లించవద్దని, శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో చర్చించిన తర్వాత తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి కొరెడ్డి లెనిన్, సంఘటన మంత్రి ఇత్నూర్ భాస్కర్, కోశాధికారి గందే ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులు విశ్వనాథ్, రాజకుమార్, సభ్యులు కనక నర్సింగ్, తిరుమలేశ్, సాయి శ్రీనివాస్, ఆయా గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు (01), హిందీ(01), హిస్టరీ(01), పొలిటికల్ సైన్స్(02), కామర్స్(01), అరబిక్ (01) సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నయని పేర్కొన్నారు.

సైన్స్ కళాశాలలో...

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డా. జె. సంగీత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్-1, ఉర్దూ -1, హిందీ-2, జువాలజీ-3, జువాలజీ ఉర్దూ మాధ్యమంలో-1 చొప్పున ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులున్నవారు అర్హులని పేర్కొన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందనీ, బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రం సమర్పిస్తే వెయిటేజీ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తగిన ధృవపత్రాలతో ఈ నెల 4వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలనీ, 6న జిల్లా కేంద్రంలోని సైన్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు హాజరుకావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

ఉట్నూర్ : మండల కేంద్రంలోని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్(01), తెలుగు(02), హిందీ(01), హిస్టరీ(01), ఎకనామిక్స్(02), పొలిటికల్ సైన్స్(01), కామర్స్(02), గణితం (02), భౌతిక శాస్త్రం(03), కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్(01), జువాలజీ (01) సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయని, అభ్యర్థులు సంబంధిత పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులున్నవారు అర్హులన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, బోధనా అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రం సమర్పిస్తే వెయిటేజీ ఉంటుందన్నారు. అర్హులైన అభ్యర్థులు తగిన ధృవపత్రాలతో ఈ నెల 04వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని, 6న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించబడుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. పూర్తి వివరాలకు 7075999789, 9490452742 సంప్రదించగలరని పేర్కొన్నారు.

నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | సెప్టెంబర్ 02, 2024 | www.navatelangana.com

ఎంజేపీలో వైద్య శిబిరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో ఆడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు వినోద్ కుమార్ నేతృత్వంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయని, విద్యార్థులు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించగా ఎవరికి డెంగ్యూ, మలేరియా నిర్ధారణ కాలేదని తెలిపారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంజేపీ హెచ్ఎస్ రాథోడ్ ఉత్తమ్, ఎంపీహెచ్ఏలు భీంరావ్, భగవాందాస్, పరుశురాం, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

హక్కినిలో వైద్య శిబిరం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని హక్కిని గ్రామంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. గ్రామంలో 45 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న ఇద్దరి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించామన్నారు. వర్షాకాలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని, వ్యక్తిగత పరిసర ప్రాంతాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. ప్రతి గర్భిణీ ఆస్పత్రిలోనే కాన్పు కోసం వెళ్లాలని, అక్కడైతే తల్లి బిడ్డలు సురక్షితంగా ఉంటారన్నారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం గోదావరి, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తతో కూడిన బీరు బాటిళ్ల సేకరణ

- ల్యాబ్‌కు పంపిన ఎక్సైజ్ అధికారులు
- ల్యాబ్ రిపోర్టు అందించాలని యాజమాని వినతిపత్రం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ఎక్సైజ్ సబ్ డివిజన్ పరిధిలోని కాగజ్‌నగర్, సిర్పూరు (టి) మండలాల మద్యం దుకాణాలలో బీరు బాటిళ్లలో చెత్త వచ్చిన విషయం ఇటీవల 'నవతెలంగాణ' దినపత్రికలో వచ్చిన విషయం తెల్సిందే. దీనికి స్పందించిన కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి ఆదివారం రెండు మద్యం దుకాణాల నుండి చెత్తతో కూడుకున్న బీరు బాటిళ్లతో పాటు మరో రెండు బీరు బాటిళ్ల(చెత్త రాని)ను కూడా సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కాగా ఈ ల్యాబ్ రిపోర్డులను కూడా తమకు అందించాలని కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మద్యం దుకాణం యాజమాని కంభంపాటి సతీష్ ఆదివారం ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. బీర్లలో చెత్త వస్తోందని సదరు కంపెనీ ప్రతినిధికి తాము ఫోన్‌చేస్తే తమ పట్లనే దురుసుగా మాట్లాడుతున్నాడని, ల్యాబ్ రిపోర్టు వస్తే ఆ రిపోర్టు ఆధారంగా తాము మున్ముందు చర్యలు తీసుకోవడానికి అవకాశముంటుందని ఈ సందర్భంగా యాజమాని సతీష్ తెలిపాడు.

సమస్యలు పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్య రంగంలోని సమస్యలు పరిష్కరించడంతో పాటు గుండి వంతెన నిర్మాణం, శిరిడి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని లేని పక్షంలో కలెక్టరేట్ ముట్టడి చేయనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యరంగ పరిస్థితి చాలా అధ్వానంగా మారాయన్నారు. వసతి గృహాలలో మెనూ పాటించకుండా నాసిరకమైన భోజనం, తినుబండారాలు ఇస్తూ విద్యార్థులను అవస్థలకు గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో రెగ్యూలర్ ప్రిన్సిపాళ్లను నియమించాలన్నారు. ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకి ప్రహరీ గోడ మంజూరు చేయాలని, మూత్రశయాలు, మరుగుదొడ్లు, అదనపు గదులకు నిధులు మంజూరు చేయాలన్నారు. వసతి గృహాలకు శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు. మండలంలోని గుండి వంతెనను వెంటనే పూర్తి చేయాలన్నారు. వాంకిడి మండలం ఖిరిడి గ్రామానికి ప్రభుత్వాలు మారిన ఒక్క కిలోమీటర్ రోడ్డు వేయడం లేదన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికనంద్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి శ్రావణి, దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరు సతీష్, జిల్లా కమిటీ సభ్యులు జాడి తిరుపతి, జిల్లా నాయకులు చిట్టి, భారతి, అక్షయ, గోగర్ల ఆకాష్ పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-బెజ్జూరు

మండలంలోని చిన్న సిద్ధాపూర్ గ్రామానికి చెందిన టాకిరే వసంత్ (48) శనివారం రాత్రి మద్యం మత్తులో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వసంత్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుని భార్య నిర్మల ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. కాగా మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ మహిళా సమాఖ్య విజయోత్సవ ర్యాలీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీల వర్గీకరణ సాధ్యమవుతున్న నేపథ్యంలో మండలంలోని అంకుసాపూర్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మహిళా సమాఖ్య ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు రేగుంట యశోద మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నిరీక్షణ నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. ఎస్సీలలో ఉన్న హెచ్చుతగ్గులు విభజనతో పోతాయని ఆశాభవం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ మాట్లాడుతూ మందకృష్ణ కృషి ఫలించిందన్నారు. ఎంతో మంది ఎన్నో రకాలుగా వర్గీకరణను ఎద్దేవా చేశారని అయిన సాధించి చూపామన్నారు. అనంతరం రేగుంట కేశవ్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకురాలు పోల్కర్ సుశీల, పోల్కర్ సుజాత, వడ్లూరి కళావతి, తోటపల్లి పద్మ, జంగపల్లి తార, గ్రామ మండల కమిటీ మహిళా నాయకురాలు పొర్ల లక్ష్మి, పుష్ప, రేణుక, వడ్లూరి మాయ, వడ్లూరి మల్లు, కవల్కర్ పద్మ, కిషన్, శేఖర్, కిరణ్, రేగుంట శ్రావణ్, గణేష్, నాగరాజు, రాజన్న, ప్రవీణ్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో జనరేటర్ ఇబ్బందులు

- నిర్వహణకు విడుదల కాని నిధులు
- ఇబ్బందుల్లో రోగులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి కేవలం పేరుకే జిల్లా ఆస్పత్రిగా కొనసాగుతోంది. దీనికి ప్రత్యేక సూపరింటెండెంట్ ఉండాల్సి ఉన్నప్పటికీ తాత్కాలిక ప్రాతిపదికన సూపరింటెండెంట్ కొనసాగుతున్నారు. సదరు అధికారికి పూర్తిస్థాయి అధికారాలు లేకపోవడంతో ఆస్పత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేస్తున్నారు. దీంతో ఆస్పత్రిలోని రోగులు చీకట్లో ఉండాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ఆస్పత్రిలో జనరేటర్ ఉన్న దాని నిర్వహణ కోసం అవసరమైన నిధులు లేకపోవడంతో తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న సూపరింటెండెంట్ తన సొంత డబ్బులతో డీజిల్ తీసుకురావాల్సి వస్తుందని తెలిసింది. సదరు అధికారి ఆ దిశగా చర్యలు తీసుకోకుంటే రోగులకు కష్టాలు తప్పడం లేదు. దీనిలో భాగంగా శనివారం రాత్రి జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురవడంతో ఆస్పత్రి ఎదుట వర్షం నీరు నిల్వ ఉండడం, ఆస్పత్రి లోపల విద్యుత్ లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పరిస్థితి తెలుసుకున్న సీపీఐ(ఎం) పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు జి.రాజేందర్, గొడిసెల కార్తీక్ ఆస్పత్రి వద్దకు చేరుకొని బంధువులు రోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. అధికారుల స్పందించి వెంటనే జనరేటర్‌లో డీజిల్ పోసి విద్యుత్ వచ్చేలా చేశారు. అయితే ప్రతిరోజు ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రతిసారి నాయకులు వచ్చి ధర్నా చేస్తేనే సమస్య పరిష్కారం చేస్తే ఎలా అని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జిల్లా ఆస్పత్రికి శాశ్వత సూపరింటెండెంట్‌ను నియమించడంతో పాటు ఆస్పత్రి నిర్వహణను సరిచేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు

- జిల్లా కేంద్రంలో పలుచోట్ల నిలిచిన నీరు
- వట్టివాగు, అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఆదివారం కూడా వర్షం కురిసింది. భారీ కారణంగా వాగులు పొంగడంతో పాటు రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. గుండి వాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండగా అక్కడ గ్రామస్తులు ఎవరు దాటకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు

జిల్లాలో శనివారం సాయంత్రం ప్రారంభమైన వర్షం ఆదివారం ఉదయం కొంత అగినప్పటికీ సాయంత్రం మళ్ళీ అదే దాటిని చూపించింది. శనివారం ఉదయం నుండి ఆదివారం ఉదయం వరకు సగటు 44 మిల్లీ మీటర్ల వర్షపాతం కురియగా మండలాల వారీగా కురిసిన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జైనూర్‌లో 47.8 మీమీ వర్షపాతం కురియగా సిర్పూర్ (యు)లో 40.4, లింగాపూర్ లో 45.1, తిర్యాణిలో 38.5, రెబ్బెనలో 83.5, ఆసిఫాబాద్‌లో 72.7, కెరమెరిలో 50.2, వాంకిడిలో 70, కాగజ్‌నగర్‌లో 69.5, సిర్పూర్ (టి)లో 25.9, కౌటాలలో 24.6, చింతలమానేపెల్లి 16.8, బెజ్జూర్‌లో 27, పెంచికల్‌పేట్ 29.8, దహెగాం 17.9 మీమీల వర్షపాతం నమోదైంది.

వట్టివాగు, అడ ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత

రెండు రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు నమోదు కావడంతో ఉదయం 10 గంటలకు ఆడ ప్రాజెక్టు నాలుగు, ఐదు, ఆరు నెంబర్ గల గేట్లను 0.5 మీటర్లు పైకి ఎత్తి 3200 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టు ఒక గేటు 0.4 మీటర్లు పైకెత్తి 760 క్యూసెక్కుల నీటిని అధికారులు కిందికి వదులుతున్నారు. దీనితో కింద ఉన్న గుండి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది.



గిరిజన సింహగర్జన విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కెరమెరి

ఈనెల పదిన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న గిరిజన సింహగర్జన సభను విజయవంతం చేయాలని సేవాలాల్ సేన జిల్లా కన్వీనర్ బాదవత్ శివప్రసాద్ నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గిరిజన సింహ గర్జనకు సంబంధించిన గొడప్రతులను ఆవిష్కరించి మాట్లాడారు. దేశానికీ స్వాతంత్రం వచ్చి 78 ఏండ్లు గడుస్తున్నా రాజ్యాంగం ఇచ్చిన ఫలితాలు గిరిజనులకు దరిచేరడం లేదన్నారు. గిరిజనులకు ఇచ్చిన హామీ మనకు 12 శాతం రిజర్వేషన్లు వెంటనే కల్పించాలన్నారు. 100శాతం ఉద్యోగాలను ఏజెన్సీ అభ్యర్థులకే కేటాయించాలన్నారు. మానుకోట ఆవరణలో రైతాంగ సాయుధ పోరాట యోధుడు లంబాడి బిడ్డ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల సమస్యల సాధనకు జిల్లాలోని లంబాడి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర నాయకులు రాథోడ్, శంకర్ నాయక్, రాథోడ్ ఉత్తం నాయక్, జాటోత్ రాజు, వెంకట్, బాధవత్ ఇందులాల్, ఇస్లావత్ శ్యామ్‌లాల్, రాథోడ్ లాల్ సింగ్ నాయక్, రాథోడ్ బలిరామ్, రాథోడ్ దేవిదాస్, రాందాస్, బాధవత్ వెంకటి పాల్గొన్నారు.



పెన్షన్ భిక్ష కాదు ఉద్యోగి హక్కు

- సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి
- జిల్లా కేంద్రంలో పెన్షన్ విద్రోహ దినం ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పెన్షన్ ఉద్యోగులకు బిక్ష కాదని అది వారి హక్కని, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణానంతరం పెన్షన్ పొందడం ఉద్యోగి హక్కు, అది ప్రభుత్వ దయాధర్మమో, భిక్షనో కాదని భారత సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును విస్మరించి పాలకులు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నాయన్నారు. ప్రపంచ బ్యాంక్ విధానాలను అమలు చేస్తూ ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం సీపీఎస్ లేదా ఓపీఎస్‌లలో ఏ విధానాన్ని అమలు చేస్తారో ఎంపిక చేసుకొమ్మని కేంద్ర ప్రభుత్వం అవకాశమిచ్చినప్పుడు 'ఎంప్లాయ్ ఫ్రెండ్లీ' ప్రకటించుకున్న అప్పటి ప్రభుత్వం, ఉద్యోగులతో మాటమాత్రంగానైన చర్చించకుండానే సీపీఎస్‌కు మొగ్గుచూపిందని ఆరోపించారు. దేశంలో పశ్చిమ బెంగాల్, త్రిపురలలో పాత పెన్షన్ విధానామే కొనసాగుతుందని గుర్తు చేశారు. త్రిపురలో ప్రభుత్వం సీపీఎస్‌ను అమలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. గతంలో సీపీఎస్‌పై సమీక్ష చేయడానికి సీఎస్ టక్కర్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో కమిటీ వేయడం జరిగిందన్నారు. సుమారుగా మన రాష్ట్రంలో ఒక లక్ష నలుభై వేల మంది సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి కుటుంబాలు సామాజిక భద్రత పట్ల దినదినం ఆందోళన చెందుతూ ప్రశాంతతలేని జీవితాన్ని గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరణించిన లేదా పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలు కేవలం వందలలో పెన్షన్ వస్తుండడం వల్ల ఆయా కుటుంబాలు వీధిన పడుతుండడం మన కళ్ళ ముందు సజీవ సాక్ష్యలుగా ఉన్నాయని తెలిపారు. సీపీఎస్ రద్దు అంశం రాష్ట్ర పరిదిలోనిదేనని రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా యూపీఎస్ పేరిట తీసుకువచ్చిన విధానం కూడా సరైనది కాదని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని అప్పటివరకు విశ్రమించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సోయం ఇందు రావ్, హేమంత్ షిండే, ఊశన్న, ఏటుకూరి శ్రీనివాసరావు, అబ్దుల్ కమర్, తోడసం శ్రీనివాస్, తలండి లక్ష్మణ్, తుకారం, సదాశివ్, మిర్యాల్కార్ శ్రీనివాస్, నాయిని శ్రీనివాస్, అమరేందర్, సంతోష్, సునీల్, ప్రభాకర్, చంద్రయ్య, ఉపేందర్, వసీం అహ్మద్, జాదవ్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



ప్రజలకు అందుబాటులో కంట్రోల్ రూమ్

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు వీలుగా కలెక్టరేట్‌లో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉంటుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ దాసరి వేణు, డీఎస్పీ సదయ్యతో కలిసి ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు. కంట్రోల్ రూమ్ ద్వారా ఫిర్యాదులు స్వీకరిస్తున్న విధానాన్ని, సంబంధిత అధికారులకు వెంటవెంట సమాచారం తెలియజేస్తూ అప్రమత్తం చేస్తున్న తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, వాటిని ఎవరికి తెలియజేశారు తదితర వివరాలను కంట్రోల్ రూమ్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సుబ్బారావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందిన వెంటనే సంబంధిత ప్రాంతాల అధికారులను అప్రమత్తం చేయాలని, నిరంతరం 24/7 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. మరో రెండు రోజుల పాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసినందున పూర్తి జాగ్రత్తతో అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కాగా వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు నెలకొంటే ప్రజలు ఏ సమయంలోనైనా కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్‌కు 6304686505 సమాచారం అందించాలని సూచించారు.

డీఎంఎఫ్టీ నిధులతో వంతెన కట్టాలి



నవతెలంగాణ-తిర్యాణి

మండలంలోని ఉల్లిపిట్ట డోర్లి క్యాంప్ ఒర్రె భారీ వర్షానికి ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయి. ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు డీఎంఎఫ్టీ నిధులను దుర్వినియోగం చేశారని, చిన్నచిన్న ఒర్రెలకు వంతెనలు కట్టలేకపోయారని, దీంతో వర్షాకాలం ప్రారంభై భారీ వర్షాలకు ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తిర్యాణి మండలంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎందుకు చిన్న చూపని ప్రశ్నించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ ఒర్రెలకు వంతెనలు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దయానంద్, లింబరావు, రాజు, లక్ష్మీ, బాపురావు, బొగరపు సాంబయ్య, అఖిల్, బండి రవి, కిషోర్, స్రవంతి పాల్గొన్నారు.

ఒర్రెలో గల్లంతై ఒకరు మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఒర్రెలో గల్లంతై ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని బొందగూడ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన టేకం గణేష్ (35) శనివారం ఉదయం పశువులు మేపడానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో అప్పటికే కురిసిన భారీ వర్షంతో గ్రామ సమీపంలోని ఒర్రెలో ప్రవాహం పెరిగింది. రాత్రి 8 గంటల ప్రాంతంలో ఒర్రెను దాటుతున్న క్రమంలో కొట్టుకుపోయాడు. స్థానికులు గమనించి రాత్రి గాలించిన దొరకకపోవడంతో ఆదివారం ఉదయం మృతదేహాన్ని బయటికి తీశారు. తండ్రి భీము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

అధికారులను పూర్తిస్థాయిలో అప్రమత్తం చేశాం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే
- ఉప ముఖ్యమంత్రితో వీసీలో వెల్లడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుత భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలోని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసినట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి, హైదరాబాద్ నుండి రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ డా.జితేందర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎసీప డీవీ.శ్రీనివాస్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, వాగులు, కల్వర్టులు, నదుల వద్దకు ఎవరు వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అధికారుల సమన్వయంతో ప్రజా రక్షణ దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలోని అడ, కుమురం భీం ప్రాజెక్టుల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పొలాల పండుగను ఘనంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

ఘనంగా పొలాల అమావాస్య పండుగను నేతకాని కులస్తులు సోమవారం ఘనంగా నిర్వహించుకోవాలని నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత, నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాజేశ్వర్, బోర్లకుంట ప్రభుదాస్, జాడీ గంగాధర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన నేతకాని కులస్తుల సమావేశం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ నేతకాని కులం, సాంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా ప్రతి గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నేతకాని సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకటయ్య, జునుగురి మల్లయ్య, టౌన్ అధ్యక్షుడు దుర్గం వసంత్, నాయకులు బండారి స్వామి, దత్తు, దుర్గం నందయ్య, అమత రావు, దుర్గం వినోద్, అల్లూరి వినోద్, బండారి సాగర్, జాడి లచ్చయ్య పాల్గొన్నారు.

గట్టుమల్లన్నను దర్శనార్థం భారీగా తరలివచ్చిన భక్తులు

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని వేలాల గ్రామ శివారు గుట్టపై వెల్సిన గట్టుమల్లన్న దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో మండల పరిధి గ్రామాల వారితో పాటు పరిసర మండలాలకు చెందిన భక్తులు గట్టుమల్లన్నను దర్శించుకున్నారు. మహా శివరాత్రితో పాటు శ్రావణ మాసంలో మల్లన్నను దర్శించుకోవడం భక్తులు ఆనవాయితిగా పాటిస్తారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నప్పటికీ భక్తుల రాకపోక కొనసాగింది. గట్టుమల్లన్నను దర్శించుకున్న భక్తులు తీపి వంటకాలు(బోనాలు) మల్లన్నకు నైవేద్యంగా సమర్పించారు. గట్టుమల్లన్న దర్శనార్థం తరలివచ్చిన భక్తులకు మండల బీజేపీ నాయకులు అరటి పండ్లు పంపిణీ చేశారు.

రాజకీయాలకు తలొగ్గి ప్రమోషన్లు ఆపుతున్న యాజమాన్యం



నవతెలంగాణ-నస్పూర్

రాజకీయాలకు తలొగ్గి సింగరేణిలో జనరల్ మజ్దూర్ ప్రమోషన్లను యాజమాన్యం ఆపుతుందని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా అన్నారు. ఆదివారం సీసీసీ ఏఐటీయూసీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాల వల్ల సింగరేణిలో రాజకీయ ప్రమేయం పెరిగి సింగరేణి ఆర్థికంగా దివాలా తీసిందని దానివల్ల కార్మికులు గత ప్రభుత్వాలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పిందని అన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు కూడా గత ప్రభుత్వాల మాదిరిగానే సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం చేస్తుందన్నారు. రాజకీయ జోక్యానికి తలొగ్గి సింగరేణి యాజమాన్యం శ్రీరాంపూర్ డివిజన్‌లో 108 సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల ఖాళీలను పూరించడానికి సర్క్యులర్ జారీ చేసి విధివిధానాలు ప్రకటించాలని అన్నారు. శ్రీరాంపూర్ డివిజన్‌లో సర్ఫేస్ జనరల్ మజ్దూర్ల కొరకు దరఖాస్తు చేసుకున్న కార్మికుల మార్కుల ప్రకారం జాబితాను విడుదల చేసి నెలలు గడుస్తున్నప్పటికీ సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లు ఆపడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ ఎటువంటి అవినీతికి తావు లేకుండా అర్హత కలిగినటువంటి కార్మికులకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లు ఇవ్వాలని జాబితాను యాజమాన్యంతో విడుదల చేపించినప్పటికీ యాజమాన్యం ఇప్పటికీ ప్రమోషన్లు ఇవ్వక పోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం వెంటనే అర్హత కలిగినటువంటి కార్మికులకు సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లు ఇవ్వకుంటే సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శులు ఆకుల లక్ష్మణ్, గునిగంటి నరసింగా రావు, సంగం సదానందం, బీర రవీందర్, చింతల నవీన్‌రెడ్డి, మల్లికార్జున్, కుమారస్వామి, నాగేశ్వరరావు, తిరుపతి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, మైనింగ్ స్టాఫ్ నాయకులు రాజశేఖర్, బాలకృష్ణ, విజయ్ నాయకులు అనంతరెడ్డి, దామోదర్, సందీప్, సాయి రాజు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానం రద్దు చేసేంత వరకు పోరాటం

● రాష్ట్ర అధ్యక్షులు దాముఖి కమలాకర్

నవతెలంగాణ-జన్నారం

కాంట్రిబూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్) విధానాన్ని రద్దు చేసి తిరిగి రాష్ట్రంలోని పాత పెన్షన్ విధానాన్ని పునారాద్ధరించేంతవరకు పోరాటం ఆగదని సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ అన్నారు. ఆదివారం తన కుటుంబ సభ్యులతో ఇంటివద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటి ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం సహా అధ్యక్షుడు బానవత్ ప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నవతెలంగాణ-నస్పూర్

భారీ నుండి అతి భారీ వర్షాలు ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నస్పూర్ పట్టణ ప్రజలు అపార్ట్మెంట్, కమర్షల్ బిల్డింగ్స్, సెల్లార్స్, లోతట్టు ప్రాంతంలో ఉన్న ఇంటి యజమానులు అందరూ వెంటనే సెల్లార్లలో ఉన్న కరెంట్ మీటర్లను, వైర్లు ఉన్న గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులోకి మార్చుకోవాలని పేర్కొన్నారు. అలాగే ముందస్తు జాగ్రత చర్యల్లో భాగంగా ఒక్క వాటర్ మోటార్‌ను అందుబాటలో ఉంచుకోని సెల్లార్ లో నీరు నిండితే వాటర్ మోటార్‌తో బయటకు పంపాలని, శిథిలావస్థలో ఉన్న ఇంటి యజమానులు సురక్షితమైన ప్రదేశానికి వెళ్లాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలిగిన వెంటనే పురపాలక సంఘం కంట్రోల్ రూమ్ నెంబర్లను ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సంప్రదించాలన్నారు. శ్రీకాంత్ (9550665667), బి రామకృష్ణ (9963287624), శానిటేషన్ పిట్టల ప్రభాకర్ (9949219646), మంచినీటి, లైట్లు మధు (9959283814), శిథిలావస్థలో ఉన్న ఇండ్ల సమస్యలు శివరామ కృష్ణ(9052686189), శ్రీధర్ ప్రసాద్ (9346874866), విద్యుత్ ఏఈ రాంమూర్తి(9440811719), కమీషనర్ చిట్యాల సతీష్ (9618801905), చైర్మన్ సూరిమిల్ల వేణు (9014791244), వైస్ చైర్మన్ గెల్లు రజిత (998592152,9866853278) నెంబర్లను సంప్రదించాలన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌కు టీపీసీసీ పదవి ఇవ్వాలి

నవతెలంగాణ-జన్నారం

బీసీ బిడ్డ ప్రస్తుత కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌కు టీపీసీసీ అధ్యక్ష పదవిని కట్ట బెట్టలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక సంతోష్ కుమార్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కత్తెరపాక రాజేష్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ దశాబ్ద కాలంగా కాంగ్రెస్‌లో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశాడని అన్నారు. ఎన్ఎస్‌యూఐ స్టేట్ ప్రెసిడెంట్‌గా ప్రస్తుతం కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీలో క్రియ శిలకంగా పనిచేస్తూ పార్టీలోని అందరి మన్ననలు పొందుతున్నాడని అన్నారు. కాంగ్రెస్‌లో ఆయన చేసిన సేవలను గుర్తించి టీపీసీసీ ప్రెసిడెంట్ పదవిని కట్టబెట్టాలని ఏఐసీసీ ప్రెసిడెంట్ మలికార్జున కార్గే, పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తివేత

● దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు
● డీసీపీ భాస్కర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు



నవతెలంగాణ-హాజీపూర్

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వస్తుండడంతో ఆదివారం అధికారులు 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎగువ నుండి భారీ గా నీరు, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి లక్షకు పైగా క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో 20 గేట్లు ఎత్తి నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలకు కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో అప్రమత్తమయ్యారు. ఆదివారం ఉదయం ఎల్లంపల్లి గేట్లు ఎత్తివేయడంతో డీసీపీ ఎగ్గడి భాస్కర్ స్థానిక పోలీస్ ఇతర అధికారులను అప్రమత్తం చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మధుసూదన్‌తో, ఎస్ఐ గోపతి సురేష్‌లు ఉదయం నుండే ప్రాజెక్ట్ వద్ద ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రాజెక్ట్ పరిస్తితిపై ఎప్పటికపుడు అప్రమత్తం చేశారు. తహసీల్దార్ ప్రాజెక్ట్ పరిస్థితులపై కలెక్టర్‌కు సమాచారం తెలియజేశారు.

ఈ ఏడాది తొలిసారి గేట్లు ఎత్తివేత..

ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లను ఈ ఏడాది తొలిసారి ఎత్తి వేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం నుంచి సెప్టెంబర్ వరకు గేట్లు ఎత్తక పోవడం ఇదే తొలిసారి. ప్రతి ఏడు వర్షాకాలంలో జూలై మొదటి వారంలోనే గేట్లు ఎత్తి నీటిని దిగువ గోదావరికి వదిలే వారు. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో రెండు నెలల ఆలస్యంగా గేట్లు ఎత్తారు. అధికారులు ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు 1.32 లక్షల క్యూసెక్కుల నీరు ఇన్ ఫ్లో రూపంలో వస్తుంది. ఔట్ ఫ్లో రూపంలో 1.40 లక్షల క్యూసెక్కుల నీటిని 20 గేట్లు ఎత్తి దిగువ గోదావరికి వదులుతున్నారు.

ప్రాజెక్ట్ వద్ద భారీ బందోబస్తు..

ఆదివారం ఉదయం ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తివేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రాజెక్ట్ దిగువన ఉన్న గ్రామాల ప్రజలను రెవిన్యూ, పోలీస్, పంచాయతీ అధికారులు అప్రమత్తం చేశారు. ఉదయం ఆయా గ్రామాల్లో డప్పు చాటింపు వేశారు. ప్రాజెక్ట్ వద్ద ఇరిగేషన్ ఈఈ స్వామి, డీఈఈలు శరత్ బాబు, బుచ్చి బాబు, ఏఈ స్నిగ్ధలు ఎప్పటికపుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రాకపోకలు బంద్..

ఎల్లంపల్లి ప్రాజెక్టుపై నుండి రాక పోకలు బంద్ చేసినట్లు అధికారులు తెలిపారు. గేట్లు ఎత్తిన సందర్భంగా ప్రాజెక్ట్‌పై నుండి వాహనాల రాకపోకలు నిషేధించినట్లు తెలిపారు. దీంతో సమాచారం తెలియక రోజు వారి ప్రాజెక్ట్‌పై నుండి ప్రయాణం కొనసాగించే వారు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక ఎస్ఐ గోపతి సురేష్ వారిని దశల వారీగా పంపించారు. నేటి నుండి పూర్తి రాకపోకలు నిషేధం అని తెలిపారు.



ప్రాజెక్ట్ వద్ద అధికార యంత్రాంగం



ప్రాజెక్టుపై నుంచి రాకపోకలు నిపివేసి పోలీసులు



ప్రాజెక్టుపైన అధికారులతో పరిస్తితి సమీక్షిస్తున్న డీసీపీ

వరకట్నం వేధింపులకు వివాహిత ఆత్మహత్య



నవతెలంగాణ-జైపూర్

మండలంలోని కుందారం గ్రామానికి చెందిన దాసరి శరణ్య(19) వరకట్నం వేదింపులతో ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానిక ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. వరకట్నం వేధింపులతో ఆగస్టు 25న పురుగుల మందు తాగిన శరణ్యను మంచిర్యాలలోని టచ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు దాసరి శరణ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్న సతీష్ శరణ్యల కాపురం కొంత కాలం సజావుగా సాగినప్పటికీ తర్వాత శరణ్య నచ్చలేదని, పుట్టింటి నుంచి వరకట్నం తేవాలని వేధించినట్లు తెలిపారు. ఈ ఏడాది మార్చి నెలలో కుందారం గ్రామంలో గల మల్లిఖార్జునస్వామి దేవాలయంలో వివాహం చేసుకున్న సతీష్ కట్నం కోసం పుట్టింటికి పంపించాడు. భర్త సతీష్‌తో పాటు అత్తింటి వారు కట్నం తేవాలని వేదించడంతో జీవితంపై విరక్తి చెందిన శరణ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలం, పట్టణానికి చెందిన 194 మంది లబ్ధిదారులకు రూ.1,94,22,504 చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అందజేశారు. పట్టణంలోని గురునానక్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపిల్ల పెండ్లి భారం కాకుడదన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకం ద్వారా పేదలకు అండగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు అమలు చేస్తున్నామని తెలిపారు. దసరాలోపు అన్ని గ్యారెంటీలు అమలు చేసేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో కార్పొరేషన్ పట్టణాలకు దీటుగా మంచిర్యాల నియోజకవర్గంను అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎ దిలీప్ కుమార్, ఎంపీడీఓ కె సరోజ, ఎంపీఓ శ్రీనివాస్, జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి, మున్సిపల్ చైర్మన్ నల్మాస్ కాంతయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మండల అధ్యక్షుడు పింగిలి రమేష్, సీనియర్ నాయకులు పూర్ణచంద్రరావు, నడిమెట్ల రాజన్న పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని స్థానిక హరిత రిసార్ట్‌లో మండలానికి చెందిన వివిధ సామాజిక కార్యకర్తల ఆధ్వర్యంలో జన్నారం మండలానికి సంబంధించిన, చెరువుల ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడు శ్రీరాముల భూమాచారి, చైర్మన్ కమ్మల విజయ్ ధర్మ, వైస్ చైర్మన్ శనిగారపు మహేష్, ప్రధాన కార్యదర్శి కనికారపు ప్రభంజనం, కార్యదర్శి వెంబడి సత్యం, ట్రెజరర్ కోడి సృజన్, కార్యదర్శి మామిడి విజయ్, సలహాదారులు దాసరి తిరుపతి, కొండపల్లి మహేష్, కార్యవర్గ సభ్యులు ఊరే వెంకట సాయి, ఎండీ ఎజాస్, మూగల వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందర్భంగా వారు మండలంలోని ఏ గ్రామంలోనైనా ఊర చెరువులు ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటి పరిరక్షణ ధ్యేయంగా ఈ కమిటీ పని చేస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

● రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



నవతెలంగాణ-నస్పూర్

ప్రస్తుత భారీ వర్షాల నేపథ్యంలో ప్రజా రక్షణ చర్యలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ డా జితేందర్‌రెడ్డి ఇతర ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, వివిధ శాఖల అధికరులతో సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. మరో 2 రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున ఎక్కడ కూడా ప్రాణనష్టం సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేంత వరకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుంటే తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైతే రాష్ట్రం నుండి సహాయక బృందాలు పంపిస్తామని అన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు వచ్చే వరకు వేచి చూడకుండా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సేవలను వినియోగిస్తూ ప్రాణనష్టం జరగకుండా చూడాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ విస్తృత ప్రచారం చేపట్టామని, జిల్లాలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో జిల్లాలోని వాగులు, కల్వర్టులు, నదుల వద్దకు ఎవరు వెళ్లకుండా నిఘా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావాత్ మోతిలాల్, డీసీపీ భాస్కర్, కలెక్టరేట్ ఏఓ పిన్న రాజేశ్వర్ పాల్గొన్నారు.

ప్రయివేటు ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి

● సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి వార్డులలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అలాగే టెస్టులు వైద్యం పేర్లతో ప్రయివేటు ఆస్పత్రుల దోపిడిని అరికట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సమావేశాన్ని శ్రీరాంపూర్ కార్యాలయంలో దాసరి రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని చాలా గ్రామాలు, గిరిజన తండాల్లోని ఆదివాసీ పేదలు, ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు. వీరికి వైద్యం అందించాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఈ నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో ప్రజలు చనిపోతున్నారన్నారు. దీనిని ఆసరాగా తీసుకున్న ప్రయివేట్ ఆస్పత్రుల యాజమాన్యలు టెస్టులు, వైద్యం పేర్లతో, ప్రజలను నిలువుగా దోచుకుంటున్నారని, ఈ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు స్పందించి, జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో బస్తి దవాఖానలల్లో మందులు, డాక్టర్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గోమాస ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యుడు బోడెంకి చందు, దుంపల రంజిత్ కుమార్, దాగం రాజారాం పాల్గొన్నారు.

బ్లాస్టింగ్ కార్మికులకు సెమి స్కిల్డ్ వేతనం చెల్లించాలి

● సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్



నవతెలంగాణ-నస్పూర్

బ్లాస్టింగ్ కార్మికులను బ్లాస్టింగ్ కార్మికులుగా గుర్తించి సెమీ స్కిల్ వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఓబీ జీవీఆర్ కంపెనీలో పనిచేస్తున్న బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికులు ఆదివారం సీఐటీయూ యూనియన్‌లో చేరారు. వీరిని దూలం శ్రీనివాస్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ 2021లో ఇందారం ఓబీ బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికులకు సెమిస్కిల్డ్ వర్కర్లుగా గుర్తించాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో అగ్రిమెంట్ జరిగిందన్నారు. కానీ అధికారులు మాత్రం దానిని అమలు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి బ్లాస్టింగ్ కాంట్రాక్టు కార్మికులకు సెమిస్కిల్డ్ వేతనాలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన, పోరాటాలకు సైతం సిద్ధమైతామని ఈ సందర్భంగా తెలిపారు.

బ్లాస్టింగ్ కార్మికుల నూతన ఫిట్ కమిటీ ఎన్నిక

బ్లాస్టింగ్ కార్మికుల నూతన ఫిట్ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా అగ్గు కిరణ్, ఆకుల నరేష్, ఉపాధ్యక్షుడు పెద్దింటి సుధాకర్, సహాయ కార్యదర్శి బండారి సత్తయ్య, కోశాధికారి సుద్దుల శంకర్, కమిటీ సభ్యులుగా తోట సురేష్, బండారి శంకర్, ఆకుల సుభాష్, గొల్ల శ్రీనివాస్, అట్కాపురం రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

అధిక వార్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

నియోజకవర్గంలో భారీ వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని తెలిపారు. ప్రధానంగా గోదావరి తీర ప్రాంతాల వారితో పాటు గ్రామీణులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, పాత ఇండ్లు, గుడిసెలు, శిథిలావస్థలో గల ఇండ్లలో ఉండకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. అదేవిధంగా వర్షాలతో వచ్చి చేరే వరద నీటితో వాగులు వంకలు పొర్లిపొంగే అవకాశం ఉన్నందున అటు వైపు వెళ్లకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లో పనులకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలని కోరారు.

ఉప్పొంగిన వాగులు రాకపోకలకు అంతరాయం

నవతెలంగాణ-బోథ్



గత రెండు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నక్కలవాడ వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే ఆదివారం ఉదయం కుండపోత వర్షంతో రోజంతా మండల కేంద్రానికి వచ్చే ప్రజలు దినమంతా ఆగిపోయారు. దీంతో ప్రజలను అప్రమత్తం చేసి, వాగు దాటనియాకుండా కంచె ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న నాయకులు మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు రంగారెడ్డి, సొసైటీ డైరెక్టర్ గొల్ల రాజు, మాజీ సర్పంచ్ కోడప విజయ్, నాయకులు అబూద్, గంగారాం వాగు వద్దకు చేరి మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని ప్రజలు ఇంటివద్దనే ఉండాలని తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో బయటికి రావాలని కోరారు.

గోదావరి పరివాహక ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు

నవతెలంగాణ-దండేపల్లి



భారీ వర్షాలకు వాగులు అటు గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గోదావరి పరివాహక ప్రాంతాలను మండల అధికారులు స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంధ్యారాణి ఎంపీడీఓ ప్రసాద్ ఎస్సై ఉదయ్ కిరణ్ గూడెం గోదావరి వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. గూడెం వద్ద తెగిపోయిన రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేపించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సంధ్యారాణి మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజలకు ఏదైనా ఇబ్బంది ఉంటే మండల అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు గడ్డం త్రిమూర్తి, గడ్డం శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్, కొంగల నవీన్, సిరికొండ నవీన్ ఉన్నారు.

మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు, నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఇస్లావత్ నరేష్ సూచించారు. మండలంలో దింద, గూడెం, శివపల్లి, కొయపల్లి, దరంపల్లి, బాబాసాగర్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు దటకూడదని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లకూడదని, మండలంలో ఉన్న వివిధ గ్రామాల ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.

ఎడతెరిపి లేకుండా వర్షం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా వాగులు పొంగడంతో పాటు చెరువుల్లోకి వరద నీరు వచ్చి చేరింది. సోమగూడెం చొప్పరిపల్లిలో డ్రైనేజీలో నుంచి కాకుండా వదర నీరు ఇళ్లలోకి చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాయకపుగూడ, తిరుమలాపూర్ గ్రామాలకు మధ్యలో వాగులు ఉండడంతో వరద కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. తడిసిన కరెంట్ స్థంబాలను ముట్టుకోవద్దని, తడిసిన చేతులతో స్టార్టర్లు, మోటార్లు, ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ లైన్‌కు తగుతున్న చెట్లను ముట్టుకోవద్దని, చెట్టు కొమ్మలు తగిలితే సంబంధిత అధికారికి సమాచారం ఇవ్వాలన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోవాలని, గాలి, దుమారం, వర్షం వలన తెగిన విద్యుత్ వైర్లకు దూరంగా ఎండాలన్నారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్ ఏమైన డ్యామేజ్ ఉంటే తమ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

నవతెలంగాణ-నస్పూర్

భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ఈ సోమవారం రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అధికార యంత్రాంగం రక్షణ చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ప్రజలు సైతం అవసరమైతే తప్ప బయటకు రావద్దని అన్నారు. ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08736-250501 నెంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర సేవల నిమిత్తం ప్రజలు సంప్రదించవచ్చని సూచించారు.

భారీ వర్షాల దృష్ట్యా ముందస్తు సహాయక చర్యలు

నవతెలంగాణ-తాండూర్



ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని వాతావరణ శాఖ వారి సూచనల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ముందస్తు సహాయక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేతా తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ సునీల్, 9059656346, శ్రీనివాస్, సానిటేషన్ జవాన్ 8074296900, ఇంద్రపాల్, సానిటేషన్ జవాన్, 960382743 సహాయక చర్యలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లరాదని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని తెలిపారు .బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో వరద సహాయక చర్యలు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు సంసిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. బెల్లంపల్లి ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుల దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులలో గెస్ట్ లెక్చరర్లుగా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఇంగ్లీష్-1, కామర్స్ టాక్సేషన్-1, బాటనీ-1, జువాలజీ-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. పీహెచ్‌డీ లేనిపక్షంలో నెట్ అర్హత కలవారికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నెట్ తర్వాత స్లెట్ లేదా సెట్ అర్హత గల వారిని తీసుకుంటామని స్పష్టం చేశారు. పై అర్హతలు గలవారు అభ్యర్థులు లేని పక్షంలో సంబంధిత సబ్జెక్టులో పీజీలో 55 శాతం మార్కులు ఉన్నవారిని పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. డిగ్రీ స్థాయిలో బోధన అనుభవానికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆంగ్లమాధ్యంలో బోధించవలసి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 4వ తేది వరకు దరఖాస్తులు స్వీకరణ, 6న డెమో, ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. అర్హత గల వారు 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు బోనాఫైడ్ కండక్ట్, నిజ ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

నేటి ప్రజావాణి రద్దు, విద్యాసంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేష్ ధోత్రే తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు, అలాగే జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు కూడా సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇతర విభాగాల ఉద్యోగులకు సెలవులను రద్దు చేస్తున్నట్లు ఎక్కడికక్కడ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండి ప్రజలను రక్షించే విధంగా చూడాలని పేర్కొన్నారు.

భార్య పిల్లలతో ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్

నవతెలంగాణ-మంచిర్యాల



పట్టణంలోని రెడ్డి కాలనీకి చేందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వెంకటేష్(40) తన భార్య, పిల్లలతో హత్మ హత్య చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. హైదరాబాద్‌లోని జీడిమెట్లలో అద్దే ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆత్మహత్యకు ముందు తన భార్య, ఇద్దరు పిల్లలు రిషికాంత్(11), విహంత్(3)లను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. స్థానికుల సమాచారం ప్రకారం.. మంచిర్యాలకు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఇప్ప రాంరెడ్డి రెండవ కుమారుడు వెంకటేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ గాజుల రామరంలో కుటుంబ సభ్యులతో కలిసి ఒక అపార్ట్మెంట్‌లో అద్దెకు ఉంటున్నాడు. వెంకటేష్ ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెట్టీ ఆర్థికంగా నష్ట పోవడంతో గత కొంత కాలంగా అప్పుల బాధతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో శనివారం రాత్రి మంచిర్యాలలో ఉన్న తన తండ్రికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. తండ్రి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు వెంకటేష్ ఉండే అపార్ట్మెంట్‌కు వెళ్లి చూసే సరికి భార్య, పిల్లలతో పాటు వెంకటేష్ చనిపోయి ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు కుటుంబ సభ్యులు వెంటనే హైదరబాద్‌కు తరలి వెళ్ళారు.

ఛలో కొత్తగూడెంను విజయవంతం చేయాలి

- కార్మిక ఐక్య సంఘాల నాయకులు

నవతెలంగాణ-నస్పూర్



బొగ్గు బ్లాక్‌ల వేలానికి వ్యతిరేకంగా కార్మిక ఐక్య సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11న చేపట్టిన ఛలో కొత్తగూడెం రిలే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని కార్మిక ఐక్య సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లను వేలం వేయకుండా సింగరేణికి కేటాయించాలని జూన్ 21 నుంచి కార్మిక ఐక్య సంఘాలు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ వ్యక్తులకు చేస్తుందని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమవుతున్నట్లు తెలిపారు. గత పాలకులు చేసిన తప్పులనే ప్రస్తుత ప్రభుత్వాలు చేస్తున్నాయని వారికి పట్టిన గతే ఈ ప్రభుత్వాలకు పడుతుందని హెచ్చరించారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి కేటాయించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, ఐఎఫ్టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి శ్రీనివాస్, టీజీఎల్‌బీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ చాంద్ భాష, ఎస్సీసీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, టీఎస్యూ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయపాల్ సింగ్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనీ రామ్ సింగ్, టీడీపీ పెద్దపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తలారి రాజు, ఎస్‌జీఎల్‌బీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి పోచమల్లు, రాష్ట్ర అధ్యక్షుడు రామన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల రామన్న, డివిజన్ నాయకుడు సారయ్య పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా : ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



నవతెలంగాణ-మంచిర్యాల

పదవులతో సంబంధం లేకుండా తాను ఏ హోదాలో ఉన్న నిత్యం నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే కొక్కిరల ప్రేమ్ సాగర్‌రావు తెలిపారు. ఆదివారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐబీ స్థలంలో సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ నిర్మాణం శంఖుస్థాపనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కాంగ్రెస్ జాతీయ నాయకులు హాజరవుతారని చెప్పారు. రాళ్లవాగు వరద ముంపు రాకుండా కరకట్టల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాలకు శంఖుస్థాపన జరుగుతుందన్నారు. ముల్కల్ల నుంచి బసంత్ నగర్ వరకు గోదావరి నదిపై రూ.375 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. రెండవ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, రూ.164 కోట్లతో శ్రీనివాస గార్డెన్ నుంచి క్వారీ రోడ్, పాత మంచిర్యాల మీదుగా నాలుగు లైన్ల రహదారి నిర్మాణంకు ప్రతిపాదనలు వెళ్లాయని చెప్పారు. ప్రతి ఒక్కరైతుకు రుణమాఫీ అవుతుందని భరోసా ఇచ్చారు. రెండు లక్షల రూపాయల రుణమాఫీ విషయంలో అపోహలు వద్దని రైతులకు సూచించారు. సాంకేతిక కారణాల వల్ల కొంత జాప్యం జరుగుతోంది తప్ప ఏ రైతుకు నష్టం జరగదని వివరించారు. కొత్త రేషన్ కార్డుల జారీ కూడా ఉంటుందన్నారు. తాను ఏ హోదాలో ఉన్నా నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలను, అవినీతిని సహించబోమని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నేతలు భూ ఆక్రమనదారులకు మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, కాంగ్రెస్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

నీటి గుంతలో పడి పంచాయతీ కార్మికుడి మృతి

- రెండు నెలల కింద తల్లి నిన్న తండ్రి
- అనాధలుగా మారిన చిన్నారులు

నవతెలంగాణ-సిరికొండ



మూర్ఛ వ్యాధితో ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి పంచాయితీ కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దాసరి శ్రీనివాస్ (36) పంచాయితీ కార్మికుడు. తన పని ముగించుకొని వస్తున్న క్రమంలో మూర్ఛ వ్యాధి రావడంతో ప్రమాదవశాత్తు చిన్న నీటి గుంతలో పడిపోయాడు. గమనించిన స్థానికులు బయటకు తీశారు. అప్పటికే మరణించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై అక్కడికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.

అనాధలుగా మారిన ఇద్దరు చిన్నారులు

మూర్ఛ వ్యాధితో ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి శ్రీనివాస్ మృతి చెందాడు. రెండు నెలల క్రితం అతడి భార్య రజిత పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. రెండు నెలల క్రితం తల్లి నిన్న తండ్రి మరణించడంతో కొడుకు రిషి (12), కూతురు మేఘన (13) అనాధలుగా మారారు. గ్రామ పంచాయితీలో అందరితో కలుపుగోలుగా ఉంటూ నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ మృతి చెందడంతో సిరికొండ గ్రామస్తులు, వ్యాపారస్తులు, దాతల సహాయంతో అంత్యక్రియల కోసం చందాలు చేసి రూ. 32 వేల నగదును యువసేన సభ్యులు ఆ కుటుంబానికి సరిపడ నిత్యావసర సరుకులను అందజేశారు.

ఘనంగా కేసీ గుప్త జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్త జయంతి వేడుకలు జిల్లా కేంద్రాల్లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆసిఫాబాద్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కొలిపాక శంకర్ కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కేసీ గుప్తా ఏడు క్లబ్బులతో వాసవి క్లబ్ ప్రారంభించి ప్రస్తుత స్థాయికి తీసుకువచ్చాడని కొనియడారు. సేవా కార్యక్రమాల్లో వాసవి క్లబ్ ముందుంటుందని తెలిపారు. సెప్టెంబర్ 1 నుండి సెప్టెంబర్ 7 వరకు కేసీ గుప్త జయంతిని పురస్కరించుకొని వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రధాన కార్యదర్శి తాటిపల్లి ఆదిత్య, కోశాధికారి శ్రీధర్, సభ్యులు గుండబాలేష్, ఎకరాల శ్రీనివాస్, పిన్న వివేక్, గుండా ప్రమోద్ పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షునిగా రావుల శంకర్ ఎంపిక కాగా, ప్రధాన కార్యదర్శిగా రావుల మురళి, కోశాధికారిగా చిలువేరు శ్రీధర్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



వ్యాన్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట



లక్షెట్టిపెట, హాజీపూర్, దండేపల్లి మూడు మండలాల వ్యాన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం కార్యాలయంలో ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు కాసిన గొట్టు లింగన్న తెలిపారు. అధ్యక్షులుగా అక్కల వెంకన్న, ఉప అధ్యక్షులుగా గడిగొప్పుల కమలాకర్, తోట వేణు, ప్రధాన కార్యదర్శిగా మాధవి కృష్ణ, కోశాధికారిగా లెసెట్టి సతీష్, కార్యవర్గ సభ్యులుగా చుంచు రవి, బత్తుల చందు, పనాస రాజేశం, బుద్ధి సత్తయ్య, రమేష్, బత్తుల మురళీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వీరిని తోటి సభ్యులు సిబ్బంది అభినందించారు.

హజ్ యాత్రకు బయలుదేరిన ఆబీద్‌కు స్వాగతం



నవతెలంగాణ-వాంకిడి

ఖమ్మం జిల్లాలోని ఇల్లందు గ్రామానికి చెందిన మహమ్మద్ అబ్దుల్ ఆబీద్ హజ్ యాత్రకు కాలి నడకన బయలుదేరాడు. ఆదివారం మండలానికి చేరుకోవడంతో మైనార్టీలు స్వాగతం పలికారు. ఆయనను కాలినడకన గోయగాం గ్రామం వరకు తీసుకెళ్లారు. హజ్ యాత్ర సులువుగా సాగాలని మసీదులో ప్రార్థనలు చేశారు. ఈ యాత్రను ముగించుకొని సుఖసంతోషాలతో తిరిగి రావాలని ప్రార్థించారు.


చట్ల శంకర్‌రావు ఆశయాలను కొనసాగిస్తాం



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం చట్ల శంకర్‌రావు వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి గోవర్ధన్ మాట్లాడుతూ కార్మికులకు, కర్షకులకు సేవలను అందించి నిరంతరం పేదల పక్షాన పోరాడుతూ అలుపెరుగని పోరాటాలు చేసిన శంకర్‌రావు పనులను గుర్తు చేశారు. ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు సిరిపురం దాస్, పట్టణాధ్యక్షుడు ఎల్.నరేష్, నాయకులు భోజన్న, కార్తీక్, మున్సిఫ్, శ్రీనివాస్, సుమేర్ పాషా పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న కుంటాల



నవతెలంగాణ-నేరడిగొండ

మండలం కుంటాల జలపాతం రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి జలపాతం పరవళ్లు తొక్కుతోంది. అందమైన పచ్చని అడవుల మధ్య ఎంతో కనువిందుగా కనిపించే కుంటాల జలపాతం కొండల మధ్యలో నుండి పరవళ్లు తొక్కుతూ ఎంతో ఎత్తు నుండి ఎగిసిపడుతూ అందరినీ అలరిస్తుంది. రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షానికి జలపాతంలో కొత్తనీరు చేరగానే కుంటాల జలపాతం జలకళ సంతరించుకుంది. ఈ సందర్భంగా కుంటాల వాటర్ ఫాల్ ఇన్‌చార్జ్ ఎఫ్ఆర్ఓ గణేష్ వివరణ కోరగా సందర్శకులు చాలామంది వస్తున్నారన్నారు. యు పాయింట్ వరకే వెళ్లడానికి అనుమతిస్తున్నామని తెలిపారు.

పోలాల పండుగకు ముస్తాబు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని అన్ని హనుమాన్ దేవాలయాల్లో పొలాల పండుగకు ఏర్పాట్లు చేశారు. పొలాల పండుగ సందర్భంగా రైతులు తమతమ ఇండ్లలో ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించడానికి రకరకాల వస్తువులను దుకాణాల వద్ద కొనుగోలు చేస్తున్నారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-వేమనపల్లి

కోడి పందెం ఆడుతున్న వారిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. మండల కేంద్రంలోని బెస్తవాడలో ఆదివారం ఉందయం కోడి పందెం అడుతున్నారని అందిన రహస్య సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు చేసి నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.600 నగదు, 3 కోడి పుంజులు, 3 కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు నిందితులు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. మొత్తం 17 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, పేకాట, జూదం, కోడి పందాలు, వ్యసనాలకు అలవాటు పడినచో కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.